సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం, 12, మే, 2023



తోకముడిచి పరార్

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణంలో అవినీతి జరిగిందని టీడీపీ ఆర్యవైశ్య నేతలు చేసిన తాము చేసిన ఆరోపణలను నిరూపించలేకపోయారు.

IIలో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,350
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,689
3 శాతం జీఎస్టీతో	రూ.5,860
సవర (8 గ్రా)	రూ.46,880

గరిష్టం/కనిష్టం 36.8 /27.9

వాతావరణం

గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలిలో 56 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2023–24, 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆయా కోర్సుల్లో ప్రవేశాల కోసం వచ్చే నెల 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. చేసిన వారు తమ సర్టిఫికెట్ల ధ్రువీకరణకు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐని సంప్రదించాన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ తేదీలను దరఖాస్తుదారులకు ఫోన్లకు ఎస్ఎంఎస్ ద్వారా పంపుతారన్నారు. వివరాలకు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి



ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు గురువారం తెలిపారు. ఒకటో యూనిట్లో 640 మెగావాట్లు, రెండో యూనిట్లో 505 మెగావాట్లు, మూడో యూనిట్లో 740 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని వెల్లడించారు.

సోమశిలలో 47.985 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం నాటికి 47.985 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి 184 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 2,450, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 200, కండలేరుకు 150 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. జలాశయంలో 95.936 మీటర్ల నీటి మట్టం ఉంది.

పెన్షనర్ల ఈకేవైసీ గడువు 15 వరకు పొడిగింపు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు సంబంధించి ఈకేవైసీ గడువు ఈనెల 15వ తేదీ వరకు పొడిగించారని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్వీపీఎస్ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంఘం చేసిన అభ్యర్థన మేరకు జిల్లా ట్రెజరీ అకౌంట్స్ అధికారి మరో నాలుగురోజులు పొడిగించినట్లు తెలియజేశారు. ఈ అవకాశాన్ని ఇప్పటి పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెల్లూరులో గతంలో ఉన్న కేంద్రాలతోపాటు పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మరో ఈకేవైసీ కేంద్రాన్ని ఆ ప్రాంత పెన్షనర్ల సౌలభ్యం కోసం ఏర్పాటు చేశామన్నారు. అలాగే జిల్లాలోని మండల కేంద్రాల్లో సబ్ ట్రెజరీ కార్యాలయ వద్ద కేంద్రాలు ఉన్నాయన్నారు. త్వరగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

నేడు కావలికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్





కావలి బీచ్ రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో సిద్ధమైన హెలిప్యాడ్



ప్రజల కోసం వేసిన కుర్చీలు



ఉదయగిరి రోడ్డులోని క్రీడల శాఖ గ్రౌండ్‌లో సభా వేదిక

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కావలికి రానున్నారు. ఉదయం 9.15 గంటలకు ఆయన తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. 10.30కు కావలిలోని జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 10.45 వరకు స్థానిక నాయకులతో మాట్లాడతారు. 10.45కు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి మినీ స్టేడియానికి రోడ్డు మార్గాన 10.50కు వస్తారు. 11 గంటలకు బహిరంగ సభ వద్దకు చేరుకుంటారు. చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. సభలో ప్రసంగించిన అనంతరం సీఎం 12.20 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 12.25 నుంచి 12.50 గంటల వరకు స్థానిక నాయకులతో మాట్లాడిన అనంతరం ఒంటి గంటకు తాడేపల్లికి బయలుదేరుతారు. ఈ మేరకు సీఎం పర్యటన వివరాలను ఆయన కార్యాలయం గురువారం వెల్లడించింది. కాగా జిల్లా యంత్రాంగం సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేసింది.

– నెల్లూరు(దర్గామిట్ట)

రైతన్నా.. గర్వంగా చెప్పు

‘ఈ భూమి నాదని’

చుక్కల భూములు.. ఈ సమస్య జిల్లాలోని వేలమంది రైతులు, ఇతరులను దశాబ్దాలుగా వెంటాడుతోంది. గతంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. వారసత్వంగా వచ్చిన భూములు తమ అనుభవంలోనే ఉన్నా క్రయ, విక్రయ హక్కుల్లేక ఏళ్లుగా యజమానులు కుమిలిపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో వేలాది కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.

- దశాబ్దాలుగా నిషేధిత జాబితాలో చుక్కల భూములు
- అనుభవంలోనే ఉన్నా పూర్తి హక్కుల్లేవు
- శాశ్వత హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు
- ఒక్క జీఓతో వేల ఎకరాలకు క్లియరెన్స్
- లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన ఆనందం
- నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో చుక్కల భూముల సమస్యకు ప్రభుత్వం చెక్ పెట్టింది. యజమానులకు శాశ్వత పరిష్కారం చూపించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కావలిలో చుక్కల భూములకు సంపూర్ణ హక్కులు కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు.

ఒకప్పుడిలా..

చుక్కల భూముల సమస్య ఇప్పటిది కాదు. దీనికి పరిష్కారం చూపడంలో గత ప్రభుత్వాలు చేతులెత్తేశాయి. అప్పటి నుంచి సాగుదారులకు హక్కుల్లేక తల్లడిల్లుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో భూములు అమ్ముకోవాల్సి వస్తే దానిని నిషేధిత జాబితాలో నుంచి తొలగించేందుకు చాలా తతంగం ఉండేది. కొత్త జిల్లాలో చుక్కల భూములు 67 వేల ఎకరాలు ఉన్నట్లు జిల్లా యంత్రాంగం గుర్తించింది. సాగుదారుల్లో రైతులు, డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్ అధికారులు, ఉద్యోగులున్నారు. ఆ భూముల్లో సాగు, బీడు భూములున్నాయి. ప్రధానంగా ఈ సమస్య పరిష్కారం కోసం అన్నదాతలైతే పనులు మానుకుని వీఆర్వోలు, తహసీల్దార్లు, ఆర్డీఓలు, జిల్లా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కేది కాదు.



భూమిని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



జీఓ ఇచ్చిన సందర్భంగా మంత్రి కాకాణి సమక్షంలో నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు (ఫైల్)

రెవెన్యూ డివిజన్	మండలాలు	గ్రామాలు	సర్వే నంబర్లు	ఎకరాలు
కావలి	10	81	7,337	11,798
కందుకూరు	7	36	3,334	5,178
ఆత్మకూరు	9	92	7,268	18,857
నెల్లూరు	11	113	5,084	7,437
మొత్తం	37	322	23,023	43,270

నేడిలా..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చుక్కల భూముల సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కలెక్టర్లకు ప్రత్యేక అధికారాలు ఇచ్చింది. దీంతో జిల్లాస్థాయిలోనే సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయి. మొత్తం 67 వేల ఎకరాల్లో 43 వేల ఎకరాల చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం చూపుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 163ని విడుదల చేసింది. మిగిలిన 24 వేల ఎకరాలకు సంబంధించి ప్రభుత్వ, అసైన్‌మెంట్, దేవదాయ తదితర భూములున్నాయి.

చాలా ఇబ్బందులు పడ్డా



గ్రామంలో నాకు 2.64 ఎకరాల భూమి ఉంది. రికార్డుల్లో చుక్కలు చూపిస్తున్నాయి. దీంతో ఏళ్ల తరబడి చాలా ఇబ్బందులు పడ్డా. ఈ ప్రభుత్వం చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం చూపిస్తుండడంతో మా కష్టాలు తొలగనున్నాయి. – గూడూరు వెంకటసుబ్బారెడ్డి, బీ అగ్రహారం, అనంతసాగరం

అప్పట్లో పట్టించుకోలేదు



గ్రామంలో 5.63 ఎకరాల చుక్కల భూమి చూపించింది. అధికారులు అడిగిన కాగితాలు ఇచ్చాను. ఏళ్ల తరబడి తిరిగాం. పట్టించుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ఈ సమస్యను పరిష్కరించారు. సంతోషంగా ఉంది.

– ఎర్రగంగు చంద్రమౌళి, బెడుసుపల్లి, అనంతసాగరం

జిల్లాలో..

క్లియరెన్స్ లభించిన చుక్కల భూములు :	లబ్ధి పొందిన రైతులు : సుమారు
43,270 ఎకరాలు	18 వేల మంది

ఆనందంగా ఉంది



ఆమనిచిరువెళ్ల గ్రామంలో నాకు 18 ఎకరాల భూమి ఉంది. 2012 నుంచి ఈ సమస్యపై తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగాను. ఫలితం రాలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క జీఓతో నిషేధిత జాబితా నుంచి మా పొలాలను తొలగిస్తుండడం ఆనందంగా ఉంది.

– ఇప్పగుంట రాధాకృష్ణమూర్తి, అమానిచిరువెళ్ల, అనంతసాగరం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో చుక్కల భూముల సమస్యలున్న రైతులను ఆదుకుంటారని చెప్పారు. నాకు గ్రామంలో 3.53 ఎకరాలున్నాయి. జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఈ సమస్య పరిష్కారమవుతుండడం చాలా ఆనందంగా ఉంది.

– నల్లమేకల ప్రసాద్, పాతదేవరాయపల్లి, అనంతసాగరం

నిషేధిత జాబితా నుంచి తొలగింపు



చుక్కల భూముల సమస్య పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. నిషేధిత జాబితా నుంచి తొలగించడంతో ఇక రైతులు వారి భూములపై సంపూర్ణ హక్కులు కలిగి ఉంటారు.

– రోణంకి కూర్మనాథ్, జేసీ

నిర్లక్ష్యంగా ఉండొద్దు

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి
- సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహణ



పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

కావలి: ‘సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలి. నిర్లక్ష్యంగా ఉండొద్దు. ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.’ అని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి కావలి పర్యటనను పురస్కరించుకుని కాన్వాయ్ ట్రయల్ రన్‌ను గురువారం ఎస్పీ స్వయంగా నిర్వహించారు. అనంతరం బందోబస్తు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. పట్టణంలోని మీటింగ్ స్థలం వద్ద సెక్టార్స్ ప్రకారం బందోబస్త్ విధులను ఎస్పీ క్లుప్తంగా వివరించారు. అందరూ అప్రమత్తంగా ఉండి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని తెలియజేశారు. పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సుమారు 1,700 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది, మహిళా పోలీసులు బందోబస్తు విధుల్లో ఉన్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. సెక్టార్, స్పెషల్ పార్టీ, కాన్వాయ్ పార్టీ, బీడీ టీమ్, ట్రాఫిక్, ఆర్వోపీల విధుల గురించి తెలిపారు. తప్పనిసరిగా ఐడీకార్డులు ధరించాలని, అందరూ సమయపాలన పాటిస్తూ నిర్ణయించిన ప్రదేశాల్లోనే ఉండాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ప్రతిఒక్కరినీ తనిఖీ చేసి అనుమతించాలని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటించనున్న అన్ని ప్రదేశాల్లో కాన్వాయ్ ట్రయిల్ రన్ ను విజయవంతంగా నిర్వహించారు.

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి, ఎమ్మెల్యే రామిరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం

- చుక్కల భూముల సమస్యకు విముక్తి
- రైతాంగానికి నేడు పండగ రోజు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కావలి: ‘సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలి పర్యటనకు సర్వం సిద్ధమైంది. హెలిప్యాడ్, బహిరంగ సభ వేదిక వద్ద ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేశాం.’ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. కావలిలో జరిగే సీఎం బహిరంగ సభ వేదిక వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాంతో కలిసి మంత్రి గురువారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం కాకాణి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎంకు ఘన స్వాగతం పలికేందుకు రైతులందరూ ఎదురు చూస్తున్నారన్నారు. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న చుక్కల భూముల సమస్యను సీఎం అసాధారణ నిర్ణయంతో పరిష్కరించి రైతుల పక్షపాతి అని మరోసారి నిరూపించారన్నారు. అన్ని విధాలా అండగా ఉంటున్న ముఖ్యమంత్రికి రైతులందరూ తమ ఆశీస్సులు అందించాలని మంత్రి కోరారు.

ఆదుకుంటాం

రాష్ట్రంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న అన్నదాతలను అన్నివిధాలా ఆదుకునేలా చర్యలు చేపట్టామని కాకాణి అన్నారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. పంట నష్టపోయిన రైతులకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ త్వరలోనే అందిస్తామని, ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

చంద్రబాబు, పవన్ పొలిటికల్ టూరిస్టులు

చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర ప్రజలు పొలిటికల్ టూరిస్టులుగా భావిస్తున్నారని, వారిని ప్రజలు పూర్తిగా మర్చిపోయారని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రజల్లో గుర్తింపు లేని వారి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. మా లెక్కల్లో వారిద్దరూ లేరని, మీడియా చెబితే కానీ వారు రాష్ట్రంలో ఉన్నారనే విషయం తెలియని వ్యక్తులని విమర్శించారు. అలాంటి వ్యక్తులు రాష్ట్రంలో తిరగడం వల్ల ఎవరికీ లాభం ఉండదన్నారు. తీరిక వేళల్లో వివిధ ప్రదేశాలు సందర్శించి, అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి భారీ భవంతుల్లో ఉండే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వల్ల రైతులకు ఉపయోగపడే అంశాలు ఏమీ ఉండవని చెప్పారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలిలో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం కలెక్టర్ ఎం.హరినారాయణన్, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం కలిసి బహిరంగ సభ ప్రదేశం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు సూచనలు, ఆదేశాలిచ్చారు. సీటింగ్ ఏర్పాట్లు, వీవీపీ గ్యాలరీలు, పార్కింగ్, భద్రతాపరమైన అంశాల గురించి ఆరాతీశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హిమవతి, నుడా వైస్ చైర్మన్ టి.బాపిరెడ్డి, కావలి ఆర్డీఓ శీనానాయక్, ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, డీపీఓ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

తోకముడిచి పరార్

- ప్రమాణం చేయని టీడీపీ నేతలు
- పసలేని ఆరోపణలతో దిగజారుడు
- మాట నిలబెట్టుకున్న ముక్కాల ద్వారకానాథ్
- అమ్మవారి గర్భాలయంలో ప్రమాణం



ప్రమాణం చేస్తున్న నుడా చైర్మన్, పాలకమండలి సభ్యులు

నెల్లూరు(బృందావనం) : నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణంలో రూ.6 కోట్ల అవినీతి జరిగిందంటూ టీడీపీ నేతలు చేసిన ఆరోపణలను వారే నిరూపించలేక తోకముడిచారు. అయితే వారికి దీటుగా తాము ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదంటూ ఆలయ పాలకమండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ సవాలు విసిరి గురువారం ఆలయంలో ప్రమాణం చేశారు. అయితే టీడీపీ నేతలు మాత్రం ప్రమాణం చేయకుండా జారుకున్నారు.

అసలేం జరిగిందంటే..

రెండు రోజుల క్రితం కర్నూలులో నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో అక్కడి ఆర్యవైశ్య సంఘీయులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో టీడీపీకి చెందిన ఆర్యవైశ్యులు పలు ఆరోపణలు చేశారు. దీనిని నెల్లూరులో ముక్కాల ద్వారకానాథ్ తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో నెల్లూరు నగరంలో టీడీపీకి చెందిన ఆర్యవైశ్య ప్రతినిధులు అసలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకు నుడా చైర్మన్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్‌తో పాటు కన్యకాపరమేశ్వరి ఆలయ పాలకమండలిని లక్ష్యంగా చేసుకుని ఆలయ నిర్మాణ నిధుల్లో రూ.6 కోట్ల మేరకు ప్రస్తుత పాలకమండలి స్వాహా చేసిందని ఆరోపించారు. దీనిపై చర్చపెట్టాలని, నిజం నిగ్గుతేల్చాలని బుధవారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.

నిగ్గు తేలుస్తామని సవాల్

టీడీపీ ఆరోపణలను ద్వారకానాథ్ నిగ్గు తేలుస్తానని గురువారం ఉదయం 11 గంటలకు అమ్మవారి ఆలయానికి రావాలని, గర్భాలయంలో అమ్మవారి ఎదుట ప్రమాణం చేసి చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. దీంతో గురువారం ఉదయం 10.58 గంటలకు ద్వారకానాథ్‌తో పాటు పాలకమండలి సభ్యులు, కుటుంబసభ్యులతో గర్భాలయంలోకి వచ్చారు. టీడీపీ నేతలు షణ్ముఖరావు, ప్రవీణ్, హరికృష్ణ, బ్రహ్మంగుప్తా, కోట మధు మరో ఏడు గురు ఉదయం 11.38 నిమిషాలకు ఆలయానికి వచ్చారు. మొదట ద్వారకానాథ్ నేతృత్వంలో పాలకమండలి సభ్యులు, కుటుంబసభ్యులు అమ్మవారి సాక్షిగా తాము అవినీతి, అక్రమాలకు పాల్పడలేదంటూ ప్రమాణం చేశారు. అనంతరం టీడీపీ ఆర్యవైశ్య నేతలు గర్భాలయంలో ప్రమాణం చేసి చర్చించేందుకు సిద్ధం కావాలని కోరారు. అయితే కులదైవం పేరుతో ప్రమాణం చేసేందుకు టీడీపీ ఆర్యవైశ్య నేతలు నిరాకరించారు. ఆలయం వెలుపల చర్చ జరగాలంటూ పసలేని ఆరోపణలకు పనిబెట్టారు. దీంతో మాటామాటా పెరిగి గందరగోళ పరిస్థితి నెలకొని తోపులాటకు దారితీసింది. సమాచారం అందుకున్న పోలీసులు సకాలంలో రంగప్రవేశం చేసి ఎటువంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా నిలువరించారు. టీడీపీ నాయకులను ఆలయం వెలుపలికి పంపించేశారు.



పాలకమండలి సభ్యులపై దౌర్జన్యానికి దిగిన టీడీపీ నేతలు

దమ్ము, ధైర్యం లేక పారిపోయారు
– ముక్కాల ద్వారకానాథ్

అమ్మవారి సమక్షంలో ప్రమాణం చేసే దమ్ము, ధైర్యం లేక టీడీపీ నేతలు పారిపోయారని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ పాలకమండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ఎద్దేవా చేశారు. అమ్మవారి ఆలయ నిర్మాణానికి సంబంధించి 550 మంది దాతలు ఉన్నారన్నారు. పునాది నుంచి గోపురాల నిర్మాణాల వరకు ప్రతి విషయాన్ని పకడ్బందీగా రికార్డు చేసి ఉన్నామన్నారు. సమావేశంలో ఆలయ పాలకమండలి చైర్మన్ సుంకు మనోహర్, కార్యదర్శి ఐతా రామచంద్రరావు, సభ్యులు సూర్యనారాయణ జేవీ ఆర్‌శ్రీను, శ్రీనివాసులు, భాస్కర్, సుబ్రహ్మణ్యం, శరణ్‌కుమార్, శ్రీరామ్‌సురేష్, గోపాల్, వివిధ సంఘాలకు చెందిన ఆర్యవైశ్య నేతలు సీతారామారావు, బాలాజీ పాల్గొన్నారు.

లెక్కలు చెప్పాలి

ఆలయ నిర్మాణం జరిగి ఆరు సంవత్సరాలైంది. ప్రతి ఏడాది సమావేశాలు జరగాలి. జమ, ఖర్చులు, మిగులును సభ్యులకు తెలపాలి. అవీ ఏమీ జరుగలేదు. ఆలయ నిర్మాణానికి రూ.కోట్లు ఖర్చు చేసినప్పుడు లెక్కలు అడిగితే ఇవ్వాలి. నేను సభ్యుడిని, దాతను వివరాలు నాకూ తెలపాలి.
– శెగు షణ్ముగరావు, గౌరవాధ్యక్షుడు, ప్రపంచ ఆర్య వైశ్యమహాసభ ఆంధ్రప్రదేశ్ విభాగం

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 140
లేయర్ (లైవ్)	: 95
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 266
లేయర్ చికెన్	: 162

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.18

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- ఆలస్యంగా వెలుగులోకి..

మనుబోలు : మండలంలోని బద్దెవోలు గ్రామంలో మూడు రోజుల క్రితం ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గూడలి శ్రీనివాసులు అలియాస్ శీనయ్య(26) ఆటోలో సీజనల్ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. శీనయ్య ప్రవర్తన సరిగ్గా లేకపోవడంతో కొంత కాలం క్రితం భార్య, తల్లిదండ్రులు అతన్ని వదిలి వెళ్లిపోయారు. దీంతో శీనయ్య ఒంటరిగా ఉంటున్నాడు. అసలే మానసిక స్థితి సక్రమంగా లేని శీనయ్య ఒంటరితనంతో మరింత కుంగిపోయాడు. ఈ క్రమంలో మూడు రోజులుగా శీనయ్య ఎవరికీ కనిపించలేదు. కాగా గురువారం శీనయ్య ఇంటి నుంచి దుర్గంధం రావడంతో అనుమానం వచ్చిన ఇరుగు పొరుగు వారు తలుపులు పగులగొట్టి చూడగా ఇంట్లో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. మృతదేహం బాగా కుళ్లి ఉండడంతో మూడు రోజుల క్రితమే ఉరేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై ముత్యాలరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరులో కంటైనర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు



మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు



హాజరైన అధికారులు

- సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఎక్కడా లేనివిధంగా నెల్లూరు నగరంలో కంటైనర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేశామని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు అన్నారు. నెల్లూరులోని విద్యుత్‌భవన్ స్కాడా కార్యాలయంలో ఆయన జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేస్తే సంస్థ అభివృద్ధి చెందుతుందని అన్నారు. అధికారులు, సిబ్బంది వారికి నిర్దేశించిన హెడ్‌క్వార్టర్స్‌లలో ఉంటూ, వినియోగదారులకు సేవలు అందించాలని, అక్కడ ఉండని వారికి హౌస్‌రెంట్ అలవెన్స్(హెచ్‌ఆర్‌ఏ) ఆపివేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీలకు సర్వీసులను వెంటనే రిలీజ్ చేయాలని తెలిపారు. లోవోల్టేజీ సమస్యలు రాకుండా చూడాలని, అవసరమైతే అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. సమావేశంలో ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు ఎస్‌వీఎస్ సుబ్బరాజు, శివప్రసాద్‌రెడ్డి, వీఎన్ బాబు, చీఫ్ జనరల్ మేనేజర్లు గురవయ్య, .ధర్మజ్ఞాని, జిల్లా ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ స్టాంపింగ్‌ను ఉపయోగించుకోవచ్చు

- డీఐజీ కిరణ్‌కుమార్

నెల్లూరు(సెంట్రల్) : అఫిడవిట్‌లు, అగ్రిమెంట్లు, దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు ఈ స్టాంపింగ్ ఉపయోగించుకోవచ్చని రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ వి.కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణంగా వినియోగించే నాన్ జుడిషియల్ స్టాంపులకు సమానంగా స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ వారిచే ఈ స్టాంపింగ్ విధానం ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ స్టాంపింగ్ అమ్మకాల కోసం ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకుంటే అనుమతి ఇస్తామన్నారు. దీని ద్వారా ఎక్కడా ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ జరపాలని ఇప్పటికే అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాన్ జుడిషియల్ స్టాంపులు కూడా అందుబాటులో ఉన్నాయని, వినియోగదారులు గమనించాలన్నారు. ఎక్కడా స్టాంపులకు కొరత లేదన్నారు. స్టాంపులు అందుబాటులో లేవనే అసత్య ప్రచారాలు నమ్మవద్దని కోరారు.

పెద్దబ్బీపురంలో ఇరువర్గాల ఘర్షణ

- ముగ్గురు వ్యక్తులకు గాయాలు

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండలంలోని పెద్దబ్బీపురం గ్రామంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య గురువారం ఘర్షణ చోటుచేసుకుంది. ఇందులో వైఎస్సార్‌సీపీకి చెందిన బుజ్జి వెంగళరెడ్డికి తీవ్రగాయాలు కాగా నారసింహారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచ్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. చిన్నపాటి వాదోపవాదాల మధ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. అనంతరం పశువులను మేపుకునేందుకు పొలాలకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టీడీపీ కార్యకర్తలు హేళనగా మాట్లాడారు. గ్రామంలోకి మా నాయకుడు వచ్చాడు, వీళ్ల అంతు చూస్తాం అని బెదిరించడంతో అక్కడే ఉన్న వెంగళరెడ్డి, నారసింహారెడ్డిలు దీటుగా సమాధానం ఇచ్చారు. దీంతో వాదోపవాదాలు పెరిగి ఘర్షణకు దారితీసింది. కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో టీడీపీకి చెందిన లింగారెడ్డి కుమారుడు వెంగళరెడ్డికి గాయం కాగా వైఎస్సార్‌సీపీకి చెందిన బుజ్జి వెంగళరెడ్డి, నారసింహారెడ్డిలకు గాయాలయ్యాయి. ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకునేందుకు ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రస్తుతానికి ఎటువంటి కేసు నమోదు కాలేదు.

నీటిలో పడి వృద్ధుడి మృతి



నాగేశ్వరరావు మృతదేహం

గుడ్లూరు : ప్రమాదవశాత్తు ఎలికేరులో పడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చెమిడిదిపాడులో బుధవారం సాయంత్రం జరగ్గా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. చెమిడిదిపాడు ఎస్సీ కాలనీకి చెందిన దాసరి నాగేశ్వరరావు(65) బుధవారం సాయంత్రం గుడ్లూరు వచ్చి తిరిగి చెమిడిదిపాడుకు వెళ్తూ ఎలికేరు మీద కట్టిన చెక్‌డ్యాం దగ్గరకు వెళ్లి కాళ్లను శుభ్రం చేసుకోవడానికి దిగాడు. ప్రమాదవశాత్తు కాలు జారడంతో నీటిలోకి జారిపోయాడు. రాత్రి నాగేశ్వరరావు ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లకు వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. గురువారం ఉదయం బంధువుల ఇళ్ల దగ్గర వాకబు చేయగా అతని ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం ఓ ఆటో డ్రైవర్ చెక్‌డ్యామ్ వద్ద తన ఆటోను శుభ్రం చేసుకుంటుండగా నీటిలో మృతదేహం తేలాడుతుండడాన్ని గమనించాడు. గ్రామంలోకి వెళ్లి విషయం చెప్పాడు. కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని మృతదేహం నాగేశ్వరరావుదే అని నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరుకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నాగేశ్వరరావుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేటలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు... నెల్లూరు బీవీనగర్‌కు చెందిన మల్లవరపు మురళీకృష్ణ(54) జగదేవిపేటలోని ఓ లేఅవుట్ స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకొంటున్నాడు. ఈ క్రమంలో ఆయన కారులో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడాన్ని గత ఆదివారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం బాగా ఉబ్బిపోయి ఉంది. ఎస్సై వెంకట రాజేష్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గురువారం తెలిపారు.

చెముడుగుంటలో పట్టపగలు చోరీ

వెంకటాచలం: తాళం వేసిన ఇంటి తలుపులు పగులగొట్టి పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని చెముడుగుంట గ్రామంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు.. చెముడుగుంట గ్రామానికి చెందిన కాకి రమేష్ ఉదయం అయ్యప్పగుడి వద్దకు వెళ్లగా, కుటుంబసభ్యులు ముత్తుకూరులోని బంధువుల ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం రమేష్ ఇంటికి చేరుకుని ముందు వైపు తలుపు తాళాలు తీయగా, వెనుక వైపున ఉన్న తలుపు తాళాలు పగులగొట్టి ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురుగా పడేసి ఉండడాన్ని గుర్తించాడు. చోరీ జరిగిందని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై అయ్యప్ప ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బీరువాలో దాచి ఉంచిన రూ.1.50 లక్షల నగదు, 25 సవర్ల బంగారు నగలు దోచుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఫైనల్లో బెర్త్ కోసం బరిలో భారత బాక్సర్లు

ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నేడు ముగ్గురు భారత బాక్సర్లు కీలకపోరుకు సిద్ధమయ్యారు. తెలంగాణకు చెందిన హుసాముద్దీన్ (57 కేజీలు), హరియాణాకు చెందిన దీపక్ భోరియా (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) సెమీఫైనల్ బౌట్‌లలో పోటీపడనున్నారు. 2022 యూరోపియన్ చాంపియన్ బిలాలా బెనామా (ఫ్రాన్స్)తో దీపక్; సైదెల్ హోర్టా (క్యూబా)తో హుసాముద్దీన్; 2022 ఆసియా చాంపియన్ అస్లాన్‌బెక్ షింబెర్జెనోవ్ (కజకిస్తాన్)తో నిశాంత్ దేవ్ తలపడతారు. సెమీఫైనల్లో గెలిస్తే ఫైనల్ చేరి స్వర్ణ–రజత పతకాల బరిలో ఉంటారు. ఓడితే కాంస్య పతకాన్ని గెల్చుకుంటారు. భారత కాలమానం ప్రకారం నేడు సాయంత్రం గం. 5:30కు దీపక్ బౌట్ ఉంది. ఆ తర్వాత హుసాముద్దీన్, నిశాంత్ దేవ్ బౌట్‌లు జరుగుతాయి. ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ఈ బౌట్‌లను ప్రత్యక్షంగా తిలకించవచ్చు. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో ఇప్పటి వరకు భారత్ నుంచి ఒక్కరే ఫైనల్‌కు అర్హత సాధించారు. 2019లో అమిత్ పంఘాల్ (52 కేజీలు) ఫైనల్లో ఓడిపోయి రజత పతకం గెల్చుకున్నాడు.

సరబ్‌జోత్–దివ్య జోడీకి స్వర్ణం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. గురువారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ సింగ్–దివ్య థడిగోల్ సుబ్బరాజు (భారత్) ద్వయం విజేతగా నిలిచింది. స్వర్ణ–రజత పతక ఫైనల్ పోరులో సరబ్‌జోత్–దివ్య జోడీ 16–14తో జొరానా అరునోవిచ్–దామిర్ మికెచ్ (సెర్బియా) ద్వయంపై విజయం సాధించింది. సరబ్‌జోత్ కెరీర్‌లో ఇది రెండో ప్రపంచకప్ స్వర్ణంకాగా... బెంగళూరుకు చెందిన దివ్యకు ప్రపంచకప్ టోర్నీలలో తొలి పతకం కావడం విశేషం. మొత్తం 55 జోడీలు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో సరబ్‌జోత్–దివ్య ద్వయం 581 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ–రజత పతక మ్యాచ్‌కు అర్హత సాధించింది. భారత్‌కే చెందిన ఇషా సింగ్–వరుణ్ తోమర్ జంట 578 పాయింట్లు స్కోరు చేసి ఆరో ర్యాంక్‌లో నిలిచి పతక మ్యాచ్‌లకు అర్హత పొందడంలో విఫలమైంది. టాప్–4లో నిలిచిన జోడీలు పతక మ్యాచ్‌లకు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలో భారత్ ఒక స్వర్ణం, ఒక కాంస్యంతో రెండు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

‘బ్లాక్‌డే’ పాటించిన రెజ్లర్లు



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన రెజ్లర్ల నిరసన జంతర్ మంతర్ వద్ద కొనసాగుతోంది. నిరసనకు 18వ రోజైన గురువారం రెజ్లర్లు ‘బ్లాక్‌డే’గా పాటించారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ వీరంతా నల్ల బ్యాండ్‌లు ధరించి తమ అసంతృప్తిని ప్రదర్శించారు. ‘ఈ రోజు మేం బ్లాక్‌డే పాటించాం. దేశం మొత్తం మాకు అండగా నిలుస్తోంది కాబట్టి విజయం సాధిస్తామని నమ్ముతున్నాం. న్యాయం దక్కే వరకు మా నిరసన కొనసాగుతుంది’ అని బజరంగ్, సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్ అన్నారు.

శ్రీకాంత్‌కు విదేశీ కోచ్



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని భారత బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్ వ్యక్తిగత విదేశీ కోచ్‌ను నియమించుకున్నాడు. ఇండోనేసియాకు చెందిన వీంపి నహోర్ది ఇక నుంచి శ్రీకాంత్‌కు శిక్షణ ఇస్తాడు. 2021 డిసెంబర్‌లో భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్‌గా ఉన్న అగుస్ ద్వి సాంతోసో తిరిగి వెళ్లిపోయాక భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్ లేకుండా పోయాడు. కోచ్ కావాలని భారత స్పోర్ట్స్ అథారిటీకి గత జనవరిలో ప్రతిపాదన పంపించినా ఎలాంటి చర్యలు లేకపోవడం... ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలు మొదలుకావడంతో తానే కోచ్‌ను నియమించుకున్నానని శ్రీకాంత్ తెలిపాడు.

భారత్‌కు క్లిష్టమైన ‘డ్రా’



దోహా: ఏషియన్ కప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు కఠినమైన ‘డ్రా’ ఎదురైంది. వచ్చే ఏడాది జనవరిలో ఖతర్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. గ్రూప్ ‘బి’లో ఆస్ట్రేలియా (ప్రపంచ 29వ ర్యాంక్), ఉజ్బెకిస్తాన్ (74వ ర్యాంక్), సిరియా (90వ ర్యాంక్) జట్లతో కలిసి భారత్ (101వ ర్యాంక్) ఉంది. వచ్చే ఏడాది జనవరి 12 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. 67 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో భారత జట్టు 1964లో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత భారత్ 1984లో, 2011లో, 2019లో ఈ టోర్నీకి అర్హత సాధించినా గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

జై జైస్వాల్...

47 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లతో 98 నాటౌట్

- 9 వికెట్లతో రాజస్తాన్ ఘన విజయం
- ఈడెన్‌లో కోల్‌కతా చిత్తు
- చహల్‌కు 4 వికెట్లు



చహల్





యశస్వి జైస్వాల్

తొలి ఓవర్లో 6, 6, 4, 4, 2, 4... ఇలా దూకుడు మొదలు పెట్టిన యశస్వి జైస్వాల్ ఆగలేదు... తొలి 6 బంతుల్లో 26 పరుగులు రాబట్టిన అతను తర్వాతి 7 బంతుల్లో మరో 24 పరుగులు కొట్టేశాడు. అంతే...13 బంతుల్లో ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీతో కొత్త రికార్డు సృష్టించాడు. 3 ఓవర్లలోపే యశస్వి హాఫ్ సెంచరీ అయిపోయింది. మరో 3 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 78 పరుగులు. అక్కడే మ్యాచ్‌లో ఎవరు గెలవబోతున్నారో అర్థమైపోయింది! ఇక మిగిలింది యశస్వి ఎంత దూరం, ఎలా వెళతాడనేది... సెంచరీ వరకు చేరగలిగాడు కానీ రెండు పరుగుల తేడాతో శతకం చేజారింది. అయితేనేం ఐపీఎల్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి ఆడిన జైస్వాల్ రాజస్తాన్ జట్టును గెలిపించాడు... మరో ఎండ్‌లో కెప్టెన్ సామ్సన్ మెరుపు బ్యాటింగ్‌తో పని సులువైంది. రాజస్తాన్ 41 బంతులు మిగిలి ఉండగానే నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది.

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో రాజస్తాన్ పండగ చేసుకుంది. నైట్‌రైడర్స్ బ్యాటింగ్ చేసినంత సేపూ నెమ్మదిగా అనిపించిన పిచ్‌పైనే పరుగులు వరద పారించి కీలక విజయాన్ని అందుకుంది. గురువారం జరిగిన పోరులో రాజస్తాన్ 9 వికెట్ల తేడాతో కోల్‌కతాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (42 బంతుల్లో 57; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. యజువేంద్ర చహల్ 25 పరుగులకు 4 వికెట్లు పడగొట్టి కోల్‌కతాను కట్టడి చేశాడు. అనంతరం రాజస్తాన్ 13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 151 పరుగులు చేసి గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 98 నాటౌట్; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు), సంజూ సామ్సన్ (29 బంతుల్లో 48 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగి జట్టును లక్ష్యానికి చేర్చారు.

వెంకటేశ్ అయ్యర్ బ్యాటింగ్‌ను మినహాయిస్తే కోల్‌కతా ఇన్నింగ్స్ ఆసాంతం పేలవంగా సాగింది. వెంకటేశ్ కూడా మరీ విధ్వంసకరంగా ఆడకపోయినా... పరిస్థితిని బట్టి తనవంతు పాత్ర పోషించాడు. వెంకటేశ్ 42 బంతుల్లో 57 పరుగులు చేయగా ... ఇతర ఆటగాళ్లంతా కలిసి 78 బంతుల్లో 89 పరుగులు చేయగలిగారంటే అతని ఇన్నింగ్స్ విలువ తెలుస్తుంది.

ధనాధన్...

ఆశ్చర్యకరంగా పార్ట్‌టైమ్ బౌలర్, కోల్‌కతా కెప్టెన్ నితీశ్ రాణా మొదటి ఓవర్ వేశాడు. ఆ ఓవర్లో ఏకంగా 26 పరుగులు రాబట్టి ప్రత్యర్థిని యశస్వి కఠినంగా శిక్షించాడు. సమన్వయ లోపంతో జోస్ బట్లర్ (0) రనౌట్ కావడంతో రాయల్స్ తొలి వికెట్ కోల్పోయింది. అయితే జట్టుపై అది ఎలాంటి ప్రభావం చూపించలేదు. యశస్వి, సామ్సన్ కలిసి వేగం తగ్గకుండా ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరి షాట్లకు నైట్‌రైడర్స్ బౌలర్ల వద్ద సమాధానం లేకపోయింది. సామ్సన్ 16 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను నేలపాలైంది. అనంతరం అనుకూల్ వేసిన ఓవర్లో 3 సిక్సర్లతో సామ్సన్ చెలరేగాడు. చివర్లో యశస్వి సెంచరీ విషయంలో కాస్త ఉత్కంఠ నెలకొంది. యశస్వి 94 పరుగుల వద్ద ఉండగా రాయల్స్‌కు 3 పరుగులు కావాలి. 13వ ఓవర్ చివరి బంతికి పరుగు తీయని సామ్సన్ సిక్సర్ కొట్టమన్నట్లుగా సైగ చేస్తూ యశస్వికి అవకాశం ఇచ్చాడు. అయితే తర్వాతి బంతికి ఫోర్ మాత్రమే రావడంతో యశస్వి 98 పరుగుల వద్ద ఆగిపోవాల్సి వచ్చింది. అయితే దానిని పట్టించుకోకుండా అతను విజయానందాన్ని ప్రదర్శించాడు.

1 ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ సెంచరీ చేసిన క్రికెటర్‌గా యశస్వి (13 బంతుల్లో) నిలిచాడు. గతంలో ఈ రికార్డు కేఎల్ రాహుల్, కమిన్స్ (14 బంతుల్లో) పేరిట ఉంది.

187 ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చహల్ రికార్డు నెలకొల్పాడు. డ్వేన్ బ్రేవో (161 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును చహల్ (143 బంతుల్లో 187 వికెట్లు) సవరించాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	11	8	3	0	16	0.951
చెన్నై	12	7	4	1	15	0.493
రాజస్తాన్	12	6	6	0	12	0.633
ముంబై	11	6	5	0	12	-0.255
లక్నో	11	5	5	1	11	0.294
బెంగళూరు	11	5	6	0	10	-0.345
కోల్‌కతా	12	5	7	0	10	-0.357
పంజాబ్	11	5	6	0	10	-0.441
హైదరాబాద్	10	4	6	0	8	-0.472
ఢిల్లీ	11	4	7	0	8	-0.605

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (సి) హెట్‌మైర్ (బి) బౌల్ట్ 10; గుర్బాజ్ (సి) సందీప్ శర్మ (బి) బౌల్ట్ 18; వెంకటేశ్ (సి) బౌల్ట్ (బి) చహల్ 57; నితీశ్ రాణా (సి) హెట్‌మైర్ (బి) చహల్ 22; రసెల్ (సి) అశ్విన్ (బి) ఆసిఫ్ 10; రింకూ సింగ్ (సి) రూట్ (బి) చహల్ 16; శార్దుల్ (ఎల్బీ) (బి) చహల్ 1; అనుకూల్ (నాటౌట్) 6; నరైన్ (సి) రూట్ (బి) సందీప్ 6; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 149. వికెట్ల పతనం:** 1–14, 2–29, 3–77, 4–107, 5–127, 6–129, 7–140, 8–149. **బౌలింగ్:** బౌల్ట్ 3-0-15-2, సందీప్ శర్మ 4-0-34-1, అశ్విన్ 4-0-32-0, రూట్ 2-0-14-0, యజువేంద్ర చహల్ 4-0-25-4, ఆసిఫ్ 3-0-27-1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (నాటౌట్) 98; బట్లర్ (రనౌట్) 0; సామ్సన్ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి) 151. వికెట్ల పతనం:** 1-30. **బౌలింగ్:** నితీశ్ రాణా 1-0-26-0, హర్షిత్ రాణా 2-0-22-0, శార్దుల్ ఠాకూర్ 1.1-0-18-0, వరుణ్ చక్రవర్తి 3-0-28-0, సునీల్ నరైన్ 2-0-13-0, సుయశ్ 3-0-22-0, అనుకూల్ 1-0-20-0.

సినిమా



“ఓ నటుడుగా నన్ను నేనెప్పుడూ విమర్శించుకుంటూనే ఉంటాను... అభినందించుకోను. ఎప్పటికప్పుడు తప్పులు వెతుకుతూనే ఉంటాను.. నటుడిగా నన్ను నేను మెరుగుపరచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాను” అని అన్నారు నాగచైతన్య. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం ‘కస్టడీ’. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నాగచైతన్య చెప్పిన విశేషాలు.

ఆ విషయం ఓ సవాల్‌గా మారింది

- నాగచైతన్య

- తమిళ చిత్రం ‘మానాడు’ విడుదల కాకముందే వెంకట్ ప్రభుగారు నాకు ‘కస్టడీ’ స్టోరీ చెప్పారు. అయితే ‘మానాడు’ విడుదలై, హిట్ సాధించిన తర్వాత, ఈ సినిమానే మేం తెలుగులో రీమేక్ చేస్తే బాగుంటుందన్నట్లుగా కొందరు నిర్మాతలు అభిప్రాయపడ్డారు. కానీ ‘కస్టడీ’ స్టోరీ నన్ను ఎగ్జయిట్ చేసింది. పైగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ కొంతవరకు పూర్తయింది. దీంతో ‘కస్టడీ’ని సెట్స్‌పైకి తీసుకెళ్లాం. ఈ సినిమాలో భాగంగా కొందరు పోలీసులను కలిశాను. వారి కథలు నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి.
- ఈ సినిమాలో నేను పోలీస్ కానిస్టేబుల్ శివ పాత్ర చేశాను. నా కెరీర్‌లో ఎప్పుడూ చేయనటువంటి కొన్ని కొత్త యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ సినిమా కోసం చేశాం. కథ రీత్యా ఈ తరహా యాక్షన్ సీక్వెన్స్‌లు అవసరం అయ్యాయి. అయితే కొన్ని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం కొంత రిహార్సల్స్ చేశాం. ఈ సినిమాలోని వాటర్ సీక్వెన్స్ కోసం మూడు రోజులు రిహార్సల్స్ చేసి, దాదాపు 15 రోజులు షూట్ చేశాం. ఈ ఎపిసోడ్ ఓ హైలైట్‌గా ఉంటుంది.
- సినిమా మొదలైన తొలి ఇరవై నిమిషాలు కూల్‌గా ఉంటుంది. ఎప్పుడైతే స్క్రీన్‌పైకి అరవింద్ స్వామిగారు వస్తారో అప్పట్నుంచి స్టోరీ మలుపు తీసుకుని ఆడియన్స్‌ను స్క్రీన్‌పై నుంచి చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది. ఈ చిత్రంలో శరత్ కుమార్, అరవింద్ స్వామి, ప్రియమణి వంటి సీనియర్స్ నటించారు. వారి నుంచి నేను కొన్ని విషయాలు నేర్చుకున్నాను. ఇచ్చిన డైలాగ్స్‌ను తనదైన స్టైల్లో ఇంప్రూవ్ చేసి చెబుతుంటారు అరవింద్ స్వామిగారు. ఇది నాకు చాలా కొత్తగా అనిపించింది. వెంకట్‌గారు ఏ స్క్రిప్ట్ అయితే నాకు చెప్పారో అదే తీశారు. ఆయన స్క్రీన్‌ప్లే స్టయిల్ తెలుగు ప్రేక్షకులకు కొత్తగా ఉంటుంది. ఈ చిత్రంలో కమర్షియల్ ఎలిమెంట్స్ స్టోరీకి తగ్గట్లుగానే ఉంటాయి. ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. అవుట్‌పుట్ పట్ల చాలా నమ్మకంతో ఉన్నాను. పోలీస్ బ్యాక్‌డ్రాప్ సినిమాల్లో నాకు ‘ఘర్షణ’, నాన్నగారి ‘శివమణి’, ‘జేమ్స్ బాండ్’ యాక్షన్ ఫ్రాంచైజీ చిత్రాలు ఇష్టం.
- నిర్మాత శ్రీనివాసా చిట్టూరిగారు సెట్స్‌లో కూల్‌గా ఉంటారు. ‘కస్టడీ’ నా కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మించబడింది. ఈ సినిమా 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. ఇళయరాజాగారు, యువన్ శంకర్‌రాజాగార్లు ఇచ్చిన మ్యూజిక్ ‘కస్టడీ’కి ప్లస్. ‘కస్టడీ’ని వేరే సినిమాతో పోల్చవద్దు. ‘కస్టడీ’ చిత్రం ‘కస్టడీ’యే.
- నేను తెలుగు డబ్బింగ్ కోసం దాదాపు పది రోజులు తీసుకుంటాను. కానీ తమిళ ‘కస్టడీ’ సినిమాకు డబ్బింగ్ పూర్తి చేయడానికి నెలరోజుల టైమ్ పట్టింది. నా సొంత వాయిస్ అయితే ఆడియన్స్‌కు యాక్టర్‌గా చేరువ కావొచ్చు. మన పెర్ఫార్మెన్స్ కూడా మెరుగ్గా కనిపిస్తుంది. అందుకే తమిళంలో డబ్బింగ్ చెప్పాను.
- నేను ఫలానా రకమైన సినిమాలు చేస్తేనే ఆడియన్స్‌కు నచ్చుతాయని అదే ట్రాక్‌లోకి వెళితే ఓ యాక్టర్‌గా అది నా బలహీనత అవుతుంది. ఈ విషయంలో నన్ను నేను కన్విన్స్ చేసుకోలేను. గతంలో నేను చేసిన కొన్ని లవ్‌స్టోరీలు వర్కౌట్ అయ్యాయి. అలా అని అవే సినిమాలు చేస్తుంటే ఓ యాక్టర్‌గా ఎదగలేను. చైతన్య ఎలాంటి సబ్జెక్ట్ అయినా బాగా చేస్తాడని ఆడియన్స్‌తో అనిపించుకోవాలి.
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులకు ఏ రకమైన సినిమాలు నచ్చుతున్నాయో తెలుసుకోవడం చాలెంజ్‌లా మారింది. కానీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా ఇస్తే వారి ఆదరణ ఓ రేంజ్‌లో ఉంటుంది.
- నా తర్వాతి ప్రాజెక్ట్ గురించి త్వరలో అధికారికంగా చెబుతాను. ‘ధూత’ వెబ్ సిరీస్ రిలీజ్ అమెజాన్ చేతిలో ఉంది. ఈ ఏడాదే స్ట్రీమింగ్ స్టార్ట్ కావొచ్చు.

మా తాతగారు, నాన్నగారు గొప్ప గొప్ప సినిమాలు చేశారు. కొన్ని స్టాండర్డ్స్ క్రియేట్ చేశారు. కొందరు వారితో మాకు పోలికలు పెడుతుంటారు. అయితే ఈ విషయాన్ని నేను ఓ ప్రెజర్‌లా తీసుకోను. చాలెంజ్‌లా స్వీకరించి, నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. ఆ స్థాయికి నేను రీచ్ అవుతానా? లేదా అనేది నాకు తెలియదు. కానీ నా శక్తివంచన లేకుండా కష్టపడుతూనే ఉంటాను.

నా గురించిన కొన్ని వార్తలు వస్తూనే ఉన్నాయి (విడాకుల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ..). డిఫరెంట్ వార్తలు రాస్తున్నారు. కానీ ఆడియన్స్ ఫూల్స్ కాదు. తెలివైనవారు. ఏది జెన్యూన్ న్యూస్.. ఏది కాదనేది వారికి తెలుసని అనుకుంటున్నాను. నేను అయితే నవ్వుకుని వదిలేస్తున్నాను.


గేమ్ స్టార్ట్

‘ది కేరళ స్టోరీ’ వంటి వివాదాత్మక సినిమా తర్వాత హీరోయిన్ అదా శర్మ ఓ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ‘హేట్ స్టోరీ 2’ ఫేమ్ విశాల్ పాండ్య దర్శకత్వంలో శ్రేయాస్ తల్పాడే హీరోగా నటిస్తున్న చిత్రం ‘ది గేమ్ ఆఫ్ గిర్గిట్’. ఈ చిత్రంలో అదా శర్మ నటిస్తున్నట్లు చిత్రయూనిట్ గురువారం ప్రకటించింది. ఇటీవల కాలంలో యువతలో బాగా ప్రాచుర్యం పొందిన ‘బ్లూ వేల్ గేమ్’ (బ్లూ వేల్ ఛాలెంజ్) నేపథ్యంలో థ్రిల్లర్‌గా ఈ కథ సాగుతుంది. ఇందులో అదా శర్మ పోలీస్ పాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– ‘‘గతంలో ‘కమాండో’ సినిమాలో భావనా రెడ్డి అనే పోలీస్ పాత్ర చేశాను. ఆ పాత్ర మంచి ప్రజాదరణ పొందింది. ఇప్పుడు ‘ది గేమ్ ఆఫ్ గిర్గిట్’లో గాయత్రీ భార్గవ్ అనే పోలీస్ పాత్ర చేస్తున్నాను. నా పాత్ర సరదాగా, విభిన్నంగా ఉంటుంది’’ అన్నారు.



● అదాశర్మ

ఓ సరదా ప్రయాణం



● నాగశౌర్య

నాగశౌర్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘రంగబలి’. ఈ చిత్రం ద్వారా పవన్ బాసంశెట్టి దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఎస్‌ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ‘రంగబలి’ని జూలై 7న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. నాగశౌర్య ట్రెండీ గెటప్‌లో కనిపిస్తున్న ఓ పోస్టర్ ద్వారా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ‘‘పల్లెటూరి నేపథ్యంలో సాగే కథతో ‘రంగబలి’ ఫన్ రైడ్ (సరదా ప్రయాణం) గా ఉండబోతోంది. ఇందులో నాగశౌర్య విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.. ఇందుకు ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. హీరోయిన్, ఇతర వివరాలను త్వరలోనే తెలియజేస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: పవన్ సీహెచ్, కెమెరా: దివాకర్ మణి.

ప్రపంచంలో జరుగుతున్నదే మళ్లీ పెళ్లిలో చూపిస్తున్నాం

- వీకే నరేశ్

‘‘ఓ మనిషి చావు చివరి దశలో ఉన్నప్పుడు చేయాల్సిన పనులు ఏవైనా మిగిలి ఉన్నాయా? ఏమైనా ప్రదేశాలను చూడాలనుకుని చూడలేక పోయామా? మనవల్ల ఎవరికైనా అన్యాయం జరిగిందా? అనే మూడు అంశాల గురించి ఓసారి ఆలోచిస్తాడు. కానీ ఏ మనిషి జీవితంలో అయినా ఈ మూడు ఆశలు తీరనవిగా ఉండకూడదు. ఇదే ‘మళ్ళీ పెళ్లి’ సినిమా బేసిక్ కాన్సెప్ట్’’ అన్నారు నటుడు వీకే నరేశ్. ఎమ్మెస్. రాజు దర్శకత్వంలో వీకే నరేశ్, పవిత్రా లోకేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘మళ్ళీ పెళ్లి’. విజయకృష్ణా మూవీస్ పతాకంపై వీకే నరేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో విజయకృష్ణా మూవీస్ లోగోను వీకే నరేశ్, పవిత్రాలు రీ లాంచ్ చేశారు. ఎమ్మెస్ రాజు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వీకే నరేశ్ మాట్లాడుతూ– ‘‘ప్రపంచంలో జరుగుతున్న అంశాలనే ఈ చిత్రంలో బోల్డ్‌గా చూపించాం. ఇది నా జీవితానికి సంబంధించిన సబ్జెక్ట్ కాదు’’ అని అన్నారు. ‘‘సినిమాలో ఉన్నట్లే జీవితంలో కూడా ఫస్టాఫ్, సెకండాఫ్ ఉంటాయి. ఎవరైనా సెకండాఫ్ చాలా బాగుండాలని కోరుకుంటారు.. అదే ‘మళ్ళీ పెళ్లి’ కాన్సెప్ట్. ఆడియన్స్‌ను చీట్ చేయడం లేదు. తప్పుని తప్పుగానే చూపిస్తున్నాం.’’ అన్నారు ఎమ్మెస్ రాజు. ‘‘ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు ఎమ్మెస్ రాజుగారి నుంచి చాలా నేర్చుకున్నాను’’ అన్నారు పవిత్రా లోకేశ్. ఈ కార్యక్రమంలో సంగీతదర్శకులు సురేష్ బొబ్బిలి, అరుల్‌దేవ్, ఎడిటర్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.



● నరేశ్, పవిత్రా లోకేశ్, ఎమ్మెస్ రాజు

హ్యాపీ ఎండింగ్

యశ్ పూరి, అపూర్వ రావు జంటగా నటించిన చిత్రం ‘హ్యాపీ ఎండింగ్’. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో హామ్స్ టెక్ ఫిల్మ్స్, సిల్లీ మాంక్స్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ‘‘అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమా ఉంటుంది’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. అజయ్ ఘోష్, విష్ణు ఓయ్, ఝాన్సీ, అనిత చౌదరి, హర్ష రోషన్, జియా శర్మ నటించిన ఈ సినిమాకు సంగీతం: రవి నిడమర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ రామానుజం.



● యశ్ పూరి

వాస్తవ ఘటనతో...

ఇషాన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘అంతం కాదిది ఆరంభం’. శక్తి మహేంద్రా, నిష్మా, ప్రణాళి హీరోయిన్స్. ప్రభు పాల్‌రాజ్, సిరాజ్ నిర్మించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని డైరెక్టర్ దశరథ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశారు. తమని ట్రాప్ చేసి, నగ్న వీడియోలు తీసి వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేసిన వ్యక్తిని బాధిత అమ్మాయిలు ఎలా పట్టుకున్నారు? అనేదే ఈ చిత్రకథ’’ అన్నారు. సిరాజ్ మాట్లాడుతూ– ‘‘ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వాస్తవ ఘటనలతో ఇషాన్ ఈ చిత్రాన్ని చక్కగా తెరకెక్కించాడు’’ అన్నారు. సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్య, రచయిత రాంబాబు గోసాల, షేర్ స్టూడియో అధినేత దేవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: టి. శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కర్రి మోహన్.



● నిష్మా, ఇషాన్, శక్తి

హీరో ఆఫ్ ఇండియా!

కిషోర్ తేజ, అంకిత మూలేర్ జంటగా ఆకుల రాఘవ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘హీరో ఆఫ్ ఇండియా’. తుమ్మలపల్లి రామసత్య నారాయణ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ లాంచ్ చేశారు. జె. భానుప్రసాద్ స్వరపరచిన మొదటి పాటని తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి, రెండో పాటని నిర్మాత సాయి వెంకట్ లాంచ్ చేశారు. ‘‘తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, అమెరికాలోనూ మా సినిమాను రిలీజ్ చేస్తున్నందుకు హ్యాపీ’’ అన్నారు తుమ్మలపల్లి రామసత్యనారాయణ.



● అంకిత, కిషోర్